



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

రిపోర్టర్లు కావాలి.

సంప్రదించు ...

9490056011, 9603969335



సంపుటి : 3 | సంచిక : 234 | ఏప్రిల్ 21 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# నేడు అకౌంట్లోకి రెండో విడత 'రైతు భరోసా' నిధులు జమ..!




మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 20

వానాకాలం,యాసంగి పంటల సాగులో రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.ఈ పథకం కింద ప్రతీయేటా రెండు విడతల్లో ఎకరాకు రూ.6 వేల చొప్పున మొత్తం ఏడాదికి రూ.12 వేలను ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. రైతు భరోసా పథకంలో భాగంగా ఇప్పటికే రబీ సీజన్లో పంట సాగుకు సంబంధించి ఎకరం, అంతకన్నా తక్కువ భూమి కలిగిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం తొలి విడతలో భాగంగా డబ్బులు జమ చేసింది. మార్చి 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఇవాళ రెండో విడత రైతు భరోసా నిధులను జమ చేయనుంది.భూపాలపల్లి జిల్లా కాటారం వద్ద జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ. 2,206 కోట్లను విడుదల చేయనున్నారు. దీంతో రెండు విడతల్లో కలిపి రూ.5,653 కోట్ల నిధులు జమ కానున్నాయి. రెండో విడతలో రెండు ఎకరాల వరకు భూమి ఉన్న వారికి నిధులు జమ కానున్నాయి. ఇక మూడో విడత చెల్లింపులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే చెప్పారు. అయితే, మూడో విడతలో మరో ఎకరానికి ఇస్తారా..

(మిగతా 2వ పేజీలో..)

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ!

మన దునియా,భూపాలపల్లి జిల్లా: ఏప్రిల్20


జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, కాళేశ్వరం చేరుకొని అక్కడ ఉన్న



## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

తీర ప్రాంతంలో మూడు




## ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం: ప్రధాని మోదీ

మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు

ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా పలు ఒప్పందాలు

ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం



ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే

(మిగతా 2వ పేజీలో..)

## బీఆర్ఎస్ పార్టీలో చేరగానే, జీవన్ రెడ్డికి కీలక పదవి ఇచ్చిన కేసీఆర్

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటన

తెలంగాణ భవిష్యత్తు ప్రయోజనాల కోసం జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడి

కరీంనగర్ జిల్లా బాధ్యతలు అప్పగిస్తానన్న కేసీఆర్

బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి పార్టీ అధినేత కేసీఆర్ కీలక పదవిని

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# నేడు అకౌంట్లోకి రెండో విడత 'రైతు భరోసా' నిధులు జమ..

(మొదటి పేజీ తరువాయి)

ఐదెకరాల వరకు పూర్తి చేస్తారా అనే స్పష్టత రావాల్సి ఉంది.రైతు భరోసా అమలు కోసం ప్రతీ సీజన్ కు సుమారు రూ.9 వేల కోట్ల చొప్పున ఏటా రూ.18 వేల కోట్లు కావాలి. ఏ సీజన్లో అయినా ఏకమొత్తంగా చెల్లించాలంటే నిధుల సర్దుబాటు చాలా కష్టం. ఈ క్రమంలోనే ప్రభుత్వం విడతల వారీగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే, ప్రస్తుతం రెండో విడతలో రైతు భరోసా నిధులు జమ కాని రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. అర్హత కలిగి ఉన్న రైతులు భూమి పట్టా, సంబంధిత వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు లేదంటే రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదించి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా అర్హత కలిగి ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ అవుతాయి.ఇక రెండో విడత పూర్తయిన వెంటనే మూడో విడత నిధులను కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు సంబంధించి మూడో విడత నిధులను ఈ నెలాఖరు లోపు జమ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తయితే మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్టే అవుతుంది.

# కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ!

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శిం చుకున్నారు. అనంతరం రూ 198 కోట్లతో చేపట్ట బోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి,భూమి పూజ చేశారు. అనంతరం మేడిగడ్డకు చేరుకుని ఈ ఎన్ డి ఎస్ ఏ చైర్మన్ అనిల్ జైన్ తో కలిసి బ్యారేజ్ ని పరిశీలించారు. అక్కడ ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.ఆయన వెంట రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , ఎన్ డీఎస్ ఏ ఛైర్మన్ అనిల్ జైన్ వున్నారు.ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో సీఎంకు స్వాగతం అందజేశారు. అనంతరం సీఎం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ శుభానంద (పార్వతి) అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాలతో సీఎంను సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అర్చకులు తీర్థప్రసాదం అందించి ఆశీర్వచనం చేశారు. సీఎం రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అక్కడి నుంచి కాటారం మండలంలోని నస్తూరిపల్లి లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరగానే, జీవన్ రెడ్డికి కీలక పదవి ఇచ్చిన కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ప్రయోజనాల కోసం ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారని అన్నారు. రాజకీయాల్లో ఎందరికో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి జీవన్ రెడ్డి అన్నారు.భిన్న రాజకీయ వేదికల కారణంగా వేర్వేరుగా పనిచేశామని, వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ తామిద్దరం మంచి స్నేహితులమని తెలిపారు. ఇద్దరం కలిసి ఎంతో పని చేశామని, నాలుగున్నర దశాబ్దాలుగా తాము స్నేహితులమేనని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవన్ రెడ్డి తనను కలిసి ఒక బ్రిడ్జి అడిగారని గుర్తు చేసుకున్నారు. ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరితే అన్ని నియోజకవర్గాల్లో ఆ ప్రభావం ఉంటుందని వ్యాఖ్యానించారు.ఆయనకు పదవులు కొత్తకాదని, నికార్సైన వ్యక్తి అని కేసీఆర్ అన్నారు. అన్నదమ్ముల్లా కలిసి పనిచేద్దామని ఆయనకు చెప్పానని, ఇక నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాధ్యతలు ఆయన భుజాల పైనే పెడతానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే జీవన్ రెడ్డికి బ్రహ్మాండమైన పదవి వస్తుందని తెలిపారు. జగిత్యాల యుద్ధం మీ వంతు తెలంగాణ యుద్ధం మా వంతు అన్నారు. ఒకప్పుడు తెలంగాణ భయంకరమైన పరిస్థితుల్లో ఉండేదని, తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఉండేదని అన్నారు. అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని నిషేధించిన రోజులు ఉండేవని అన్నారు. మన బతుకు, మన భాష, మన ఉద్యోగాల మీద దాడి జరిగేదని అన్నారు. హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వస్తే బషీర్‌బాగ్ కాల్పులు జరిపారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తాను బయలుదేరితే అవహేళనలు చేశారని అన్నారు.



# ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

# జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చన్న జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ

ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం

జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఉత్తర జపాన్‌లో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూప్రకంపనలు వచ్చాయి. దీనితో అధికారులు తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో, ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. జపాన్ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా భూకంపాలు సంభవించే దేశాల్లో ఒకటి. సాధారణంగా ప్రతి సంవత్సరం దాదాపు 1,500 వరకు భూకంపాలు సంభవిస్తాయి.

# లెబనాన్‌లో క్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇజ్రాయెల్ సైనికుడు... దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నెతన్యాహు

**లెబనాన్‌లో ఏసుక్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇజ్రాయెల్ సైనికుడు**

**సోషల్ మీడియాలో ఫోటో వైరల్.. తీవ్రంగా ఖండించిన ప్రధాని నెతన్యాహు**

**సైనికుడిపై క్రిమినల్ విచారణ.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**ఇది మా విలువలకి విరుద్ధమని స్పష్టం చేసిన ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్)**

**విగ్రహాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సైనిక అధికారులు**



దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనికుడొకరు ఏసుక్రీస్తు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. ఈ చర్యను అత్యంత కఠినమైన పదజాలంతో ఖండిస్తున్నానని, ఈ ఘటన గురించి తెలిసి తాను దిగ్భ్రాంతికి, విచారానికి గురయ్యానని సోమవారం ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సైనిక అధికారులు క్రిమినల్ విచారణ జరుపుతున్నారని, బాధ్యుడైన సైనికుడిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని నెతన్యాహు తెలిపారు.లెబనాన్‌లో ఓ సైనికుడు సుత్తితో ఏసుక్రీస్తు విగ్రహాన్ని పగలగొడుతున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ప్రకటన వెలువడింది. ఈ ఘటనపై ఆదివారమే స్పందించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్), ఇది తమ విలువలకి పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. సైనికుడి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని, ఈ ఉదంతంపై నార్తర్న్ కమాండ్ దర్యాప్తు చేస్తోందని పేర్కొంది."యూదు దేశంగా ఇజ్రాయెల్ అన్ని మతాల పట్ల సహనానికి, పరస్పర గౌరవానికి కట్టుబడి ఉంది. మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలతో పోలిస్తే ఇజ్రాయెల్‌లో క్రైస్తవ జనాభా వృద్ధి చెందుతోంది. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం" అని నెతన్యాహు తన ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో వివరించారు. ధ్వంసమైన విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు స్థానిక సమాజానికి సహాయం అందిస్తామని కూడా ఐడీఎఫ్ హామీ ఇచ్చింది. హెజ్బొల్లా ఉగ్రవాద నెట్‌వర్క్‌ను కూల్చివేయడమే తమ లక్ష్యమని, మతపరమైన కట్టడాలను ధ్వంసం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేసింది.


# పెద్దపల్లి జిల్లాలో దారుణం... చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

**సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దుర్ఘటన**

**ఇంటి ముందు ఆడుకుంటుండగా మూడేళ్ల బాలికపై వీధి కుక్కల దాడి**

**పొలాల్లోకి లాక్కెళ్లి పీక్కుతిన్న కుక్కలు**

తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. దివ్యా బెహ్రా అనే బాలిక తమ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటోంది. ఈ సమయంలో బాలికపై కుక్కలు దాడి చేశాయి.కుక్కలు బాలికను నోట కరుచుకుని పొలాల్లోకి తీసుకువెళ్లాయి. ఈ క్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో చిన్నారి మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పని చేస్తున్నారు. తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ హృదయ విదారకమైన ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# గ్రామసభ అనుమతి లేకుండా ఆదివాసీల భూములు తీసుకోరాదు

**ఆదివాసీల భూములు చట్టవిరుద్ధంగా సేకరణకు సిద్ధమైన ప్రభుత్వ అధికారుల మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలి**

**ఆదివాసి సేన లీగల్ అడ్వైజర్ ఊయిక రవి**

**మన దునియా కుక్కునూర్ ఏప్రిల్ 20**



గ్రామసభ అనుమతి లేకుండా ఆదివాసీల మనసున్నయ్య నుంచి ప్రభుత్వం భూములను సేకరించరాదని చట్ట విరుద్ధంగా భూములు సేకరణకు సిద్ధమైన ప్రభుత్వ యంత్రాంగం మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలా చేయాలని ఆదివాసి సంఘాల లీగల్ అడ్వైజర్ ఊయిక రవి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కుకునూరు మండల పరిధిలోని దాచారం గోమ్ముగూడెం పంచాయతీలోనీ గుండు గూడెం అరవపల్లి గుండం బోరు నెమలి పేట ఊటబోరు రాయికుంట తదితర గ్రామాలకు సంబంధించినటువంటి ఆదివాసీలు గత తాత ముత్తాతల కాలం నుంచి సేద్యం చేస్తూ భూములలో సాగు చేస్తున్నారు ఇటీవల కొంతమంది వ్యక్తులు గిరిజనేతరూలు వచ్చి ఇవి మా భూములు అని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ల్యాండ్ టూ ల్యాండ్ ప్యాకేజ్ కి భూములకు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని ఇటీవల చట్టవిరుద్ధంగా ఎటువంటి నోటీసులు లేకుండా గ్రామసభ అనుమతి లేకుండా కొంతమంది అధికారులు వచ్చి సర్వే చేస్తున్నారని ఇది చట్ట విరుద్ధమని ఇలాంటి కార్యక్రమాలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఆదివాసి హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని వారి యొక్క జీవనభృతికి విఘాతం కలుగుతుందని ఇటువంటి అధికారుల మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మరియు కేసులు వెంటనే నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామసభ అనుమతి తప్పనిసరి అని ఉన్న వాటిని మొత్తం బేకాతరు చేస్తున్నారని ప్రభుత్వ యంత్రాంగం కూడా గుర్తు చేసుకోవాలని షెడ్యూలు భాగంలో పనిచేస్తున్నారని కనీస అవగాహన ఉండాలని వారు అన్నారు. వందల ఎకరాలను ప్రభుత్వ భూములను రకరకాల రాజకీయ నాయకులు పెద్దలకు ప్యాకేజీ కింద పెట్టి కోట్ల కుంభకోణం జరిగిందని కానీ ఇది ఏజెన్సీ ప్రాంతం కనీస హక్కులు లేకున్నా కూడా హక్కులు కల్పించి ప్యాకేజీలు పెట్టి కోట్ల కుంభకోణం చేసి ఉన్నారని దీనిమీద సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. దాచారం గొమ్ముగూడెం పంచాయతీలలో వేల ఎకరాలు ప్రభుత్వ భూములను చట్టవిరుద్ధంగా రాజకీయ నాయకులు ప్రభుత్వ యంత్రాంగం కలిసి పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని భూములు సేకరించే విషయంలో షెడ్యూల్ ప్రాంత చట్టాలను కూడా పరిగణలోకి తీసుకున్న తర్వాతే భూమి సేకరణ జరగాలని చట్టం చాలా స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఇట్టి విషయం మీద అవసరమైతే ప్రభుత్వ అధికారుల మీద ప్రైవేట్ కంప్లైంట్ ద్వారా క్రిమినల్ కేసులు కచ్చితంగా నమోదు చేస్తామని వారు అన్నారు. అలాగే ఇసుక సొసైటీల విషయంలో కూడా అసలైన లబ్ధిదారులకు జీవనోపాధి దక్కడం లేదని పేరుకే గిరిజన సొసైటీలను పెత్తనం మొత్తం బడా బాబులది అని కొన్ని కోట్ల ఏజెన్సీ సంపద స్థానిక ఆదివాసీలకు దక్కకుండా మైదాన ప్రాంతాలకు వెళ్ళిపోతుందని ఇక్కడ పూర్తి హక్కులు ఆదివాసీలకు మాత్రమే దాఖలు చేయబడిన అని కానీ రకరకాల పేరుతోటి మైదాన ప్రాంతాలకు సంపద వెళ్లిపోతుందని వారు దుయ్యబట్టారు. ఇప్పటికైనా అక్రమంగా అక్రమ ఇసుక స్థలకాలు నిర్వహణ నిలుపుదల చేయాలని స్థానిక ఆదివాసీలకు మాత్రమే అవకాశం కల్పించి జీవనోపాధి కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోడే చుక్కమ్మ,మరియు ఎంపీటీసీ సోడే సాధు, పిసా కమిటీ సభ్యులు సోడే వెంకటేష్, సోడే చంద్రయ్యా,అలాగే నాయకులు మడివి రమేష్ వరుస శివ పృధ్వి మాజీ సర్పంచులు వర్ష నాగేశ్వరరావు ఆదివాసి సేన నాయకులు వగ్గేల వెంకటేశ్వర్లు సోందెం సుమన్ బాబు కురసం రమేష్ తాటి ప్రవీణ్ గ్రామస్తులు పెద్దలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక దోపిడీని అరికట్టిన పోలీసులు







**మన దునియా కుక్కునూర్ ఏప్రిల్ 20**

క్రైమ్ నం. 41/2026, ఖ/ం 329(3), 318(4), 303(2) దీఛీూ, సెక్షన్ 21(1) వీవీణ= చట్టం & సెక్షన్ 3 PDPP చట్టం, కుక్కునూరు పి.ఎస్.:-19-04-2026 తేదీ రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో ఆంధ్రతెలంగాణ సరిహద్దు ప్రాంతంలో, కిన్నెరసాని వాగు సమీపంలో సీతారాం నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ఈ విషయం 20-04-2026 తేదీ ఉదయం 01:30 గంటలకు రిపోర్ట్ చేయబడింది. కుక్కునూరు పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీ కె. రాజారెడ్డి కి వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, పోలీసులు మధ్యవర్తులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడికి చేరుకున్న తరువాత సుమారు 20 టిప్పర్ లోడ్లు ఇసుకను అక్రమంగా తవ్వి తెలంగాణ రాష్ట్రానికి తరలించినట్లు గుర్తించారు. ఆ ప్రదేశంలో గుంతలు మరియు తవ్వకాలు జరిగిన గుర్తులు స్పష్టంగా కనిపించాయి. సంఘటనా స్థలంలో శ్రీ వెంకటేశ్వర ఎర్త్ మూవర్స్‌కు చెందిన టాటా హిటాచీ జుఠ-130 ఎక్స్కవేటర్ యంత్రం కనిపించింది. విచారణలో, ఆ యంత్రాన్ని ూా-1 బత్తా అచ్చయ్య ఏ అచ్చిబాబు యాదవ్ (వయసు సుమారు 45 సంవత్సరాలు, డోర్ నం. 1-170) మరియు ూా-2 పోతనబోయిన చంద్రరావు, తండ్రి వెంకటేశ్వర్లు (వయసు సుమారు 50 సంవత్సరాలు, డోర్ నం. 6-66), వీరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బుర్గంపాడు గ్రామం & మండలం నివాసితులు, వీరి పర్యవేక్షణలో నడిపిస్తున్నట్లు తెలిసింది. వారు సీతారాం నగర్ రెవెన్యూ పరిధిలోని కిన్నెరసాని వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తూ ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినట్లు నిర్ధారించబడింది. ూా-3 అనే వ్యక్తి ఎక్స్కవేటర్ యంత్రాన్ని నడిపేందుకు నియమించబడిన ఆపరేటర్‌గా ఉన్నాడు.

# కృష్ణాపురంలోని తండ్రిని కోల్పోయిన పిల్లలకు అండగా జాతీయ బీసీ సంక్షేమ ఉపాధ్యక్షులు మాంచర్ల నాగేశ్వరరావు


**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 20**

ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామంలోని తండ్రిని కోల్పోయిన తల్లి పిల్లలకు అధైర్య పడవద్దు మేము మీకు అండగా ఉంటాము అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు తండ్రి చనిపోయిన భార్య పిల్లలకు మనో ధైర్యాన్ని నింపి ఆ కుటుంబానికి దిశా దిన కర్మ ఖర్చుల నిమిత్తం 5000 వేల రూపాయలు అందజేసి మానవత్వం చాటుకున్నారు నిరుపేద కుటుంబాలకు గ్రామస్తులు ఆర్థికపరంగా అండగా ఉండాలని కోరినారు వారితో పాటు ములుగు జిల్లా కార్యదర్శి బట్ట నాగేందర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు పోడెం సురేష్ బట్ట పురుషోత్తం ట్రైబల్ లీడర్ కుచ్చింటి చిరంజీవి మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు



# గోదావరి ఒడ్డున పేలుడు పరికరాలు బర్లకు తీవ్ర గాయాలు

**మన దునియా,మంచిర్యాల జిల్లా జన్నారం:ఏప్రిల్ 20**



మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని బాదంపల్లి గ్రామ సమీపంలో గోదావరి నది ప్రవాహ ఒడ్డున ఆదివారం ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తుతెలియని వేటగాళ్లు పేలుడు పరికరాలు అమర్చినట్లు సమాచారం. గ్రామానికి చెందిన పశువుల కాపరులు తమ బర్లను మేత కోసం గోదావరి తీర ప్రాంతానికి తీసుకువెళ్లగా, మేత కోసం తిరుగుతున్న బర్లలో కొన్ని ఆ పేలుడు పరికరాలను తినడంతో ఒక్కసారిగా పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో పలు బర్లకు తీవ్ర గాయాలు కావడంతో కాపరులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గాయపడిన పశువులను సమీపంలోని వెటర్నరీ వైద్యుల వద్ద చికిత్సకు తరలించారు. ఈ ఘటనతో గ్రామస్థుల్లో భయం నెలకొంది. వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఇలాంటి ప్రమాదకర పేలుడు పరికరాలు అమర్చడం వల్ల నిరపరాధ పశువులు బలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఇదే ప్రాంతంలో మూడు రోజుల క్రితం కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పేలుడు పరికరాలను తినడం వల్ల నాలుగు మేకలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామ ప్రజల్లో మరింత భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. బాధ్యుల్ని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# ఇంద్రవెల్లి గాయానికి నేటికి 45 ఏళ్లు!




**మన దునియా,అదిలాబాద్ జిల్లా:ఏప్రిల్ 20**

జల్.. జంగల్.. జమీన్, కోసం సాగిన ఆ పోరాట ఉద్యమం నేటికీ 45 ఏళ్లు పూర్తి చేసుకున్న ఆ పోరాట స్ఫూర్తి ఇప్పటికీ ప్రజల గుండెల్లో మిగిలే ఉంది, అదిలాబాద్ జిల్లా లో1981 వ సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీ చిరస్థా యిగా నిలిచి పోయిన దినం, నాడు ఇంద్రవెల్లి కేంద్రంగా జరిగిన సభలో పాల్గొన్న ఆదివాసులపై పోలీసులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పు ల్లో 19 మంది గిరిజనులు మరణించగా.. మరో 178 మందికి గాయాలయ్యాయి, నాడు మరణించిన వారికి గుర్తు గా ఏప్రిల్ 20 వ తేదీన ఇంద్రవెల్లిలో స్మారక స్తూపం నిర్మించి మరణిం చిన ఆదివాసి అమర వీరులను స్మరించుకుం టున్నారు. ఈ నేపథ్యంలో అదిలాబా ద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా... ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎంపీ నగేష్ తో పాటు.. మాజీ ఎంపి సోయం బాపూరావ్ లు. అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన పోరాటంలో అనేకమంది ఆదివాసులు అమరులై నేటికీ 45 ఏళ్లు నిండాయి. ఆనాటి నెత్తుటి మరకలు గిరిజనుల గుండెల్లో నుంచి నేటివరకు చెరిగిపోలేదు అన్నారు. ఆ చేదు జ్ఞాపకాలు అడవి బిడ్డలను వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఎప్రిల్ 20 వచ్చిందంటే గిరిజన గ్రామా ల్లో ఆనాటి జ్ఞాపకాలను గిరిజనులు నెమరేసుకుం టూ పోరాటంలో ఆసువులు బాసిన తమ వారికి నివాళులు అర్పించి స్మరించుకుంటున్నమని అన్నారు. వారి ప్రాణత్యాగం ఫలితంగానే పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు వచ్చాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ

**జన సమితి పార్టీ ప్లీనరీ సమావేశం**

**మన దునియా,హైదరాబాద్ జిల్లా:ఏప్రిల్ 20**



హైదరాబాద్ లోని ఖైరతాబాద్ పార్కింగ్ యాడ్ నందు తెలంగాణ జన సమితి పార్టీ నాలుగవ ప్లీనరీ సమావేశం నిర్వహించడం జరిగింది. గోడపత్రిక ను జి.హెచ్.ఎం.సి. ఔట్సోర్సింగ్ ప్రెసిడెంట్ బాలరాజు తో కలిసి తెలంగాణ మున్సిపల్ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులందరికీ వచ్చే నెల అనగా మే 12 ,2026 జరిగే ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కార్మికులను కోరారు. ఇట్టి కార్యక్రమంలో గోడ పత్రిక ఆవిష్కరణ కు మున్సిపల్ కార్మికులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు...

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# 250 కోట్లు భరణం కోరిన సంగీత


**35 కోట్లు ఇస్తానంటున్న హీరో విజయ్**



**మన దునియా,తమిళనాడు: ఏప్రిల్ 20**

తమిళ వెట్రి కళగం పార్టీ అధినేత స్టార్ హీరో విజయ్ విడాకుల కేసు పెను సంచలనంగా మారింది. ఇవాళ కోర్టులో విజయ్ భార్య సంగీత 250 కోట్ల భరణం కోరారు. 35 కోట్లు ఇవ్వగలనని, కుమారుడు కుమార్తె బాగోగులు తానే చూసుకుంటానని విజయ్ కోర్టుకు తెలిపారు. విజయ్ భార్య సంగీత తన 27 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. నటి త్రిష, విజయ్ సహ జీవనం చేస్తున్నారనేది ఆమె ఆరోపణ. వివాహేతర సంబంధం, శారీరక క్రూరత్వం కారణంగా ఆమె విడాకులు కోరినట్లు పేర్కొన్నారు.తమిళనాడులో జరుగనున్న ఎన్నికల్లో టివికె పార్టీ విజయ్ నాయకత్వంలో బరిలో వుంది. తన డ్రైవర్ తోసహా అనేక మంది యువతకు సీట్లు కేటాయించి పోటీ చేయిస్తున్నారు. అయితే ఈ పార్టీ చీల్చే కొద్దిపాటి ఓట్లతో స్టాలిన్ కే మళ్ళీ గెలువు అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది! తమ కేసు ముగిసేంత వరకు తాను విజయ్ ఇంట్లో ఉండేందుకు అవకాశం ఇవ్వాలని సంగీత మరో పిటిషన్ వేశారు. గత రెండేళ్లుగా ఇద్దరూ విడివిడిగా వుంటున్నారు. పిల్లలు కూడా సంగీత దగ్గరే వుంటున్నారు. కాగా, ఎన్నికల్లో తనను ఓడించే టార్గెట్ గా ఆమె చర్యలు వుంటున్నాయని, తాను ముఖ్యమంత్రి కాకుండా కక్షతో సంగీత కుట్రలు పన్నుతున్నారని విజయ్ ఆరోపిస్తున్నారు. ఎన్నికల అఫిడవిట్ లో 605 కోట్లు ఆస్థులు ఉన్నట్లు విజయ్ పేర్కొన్నారు. భార్య సంగీత, ఇద్దరు పిల్లల పేరిట ఒక్క ఆస్థి కూడా లేకపోవడం విశేషం!

# ఇంటర్ విద్యార్థులకు మరో అవకాశం!



**మన దునియా,హైదరాబాద్'ఏప్రిల్ 20**

తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ..ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు చెల్లింపు గడువును పెంచుతూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకే షన్, ప్రకటించిన వివరాల ప్రకారం.. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించే గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ గడువు అంతకుముందే ముగియాల్సి ఉన్నప్పటికీ.. విద్యార్థులు , తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు బోర్డు ఈ వెసులుబాటు కల్పించింది.ప్రథమ, ద్వితీయ సంవత్స రాల్లో మార్కులు తక్కువ గా వచ్చి, ఇంప్రూవ్ మెంట్ రాసుకోవాలనుకునే కూడా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అంతే కాకుండా.. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించ లేక పోయిన విద్యార్థులు తమ విద్యా సంవత్సరాన్ని కాపాడుకోవడానికి ఈ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకావచ్చు. జనరల్ మరియు వొకేషనల్ కోర్సుల విద్యార్థులందరికీ ఈ అవకాశం వర్తిస్తుంది.

# ప్రణామ్ డే కేర్ సెంటలోని వయోవృద్ధులకు హెల్త్ క్యాంప్

**మన దునియా ములుగు జిల్లా: ఏప్రిల్ 20**




ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత సూచనల తో ములుగు జిల్లా కేంద్రంలోని ప్రణామ్ డే కేర్ సెంటర్ నందు వయోవృద్ధులకు హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగినది. ప్రత్యేక వైద్య బృందం రాయినిగూడెం పిహెచ్సి డాక్టర్ నందకిషోర్, డాక్టర్ దీపిక డే కేర్ సెంటర్ లోని వయోవృద్ధులకు హెల్త్ చెకప్ నిర్వహించారు.ఈ క్యాంపులో వయోవృద్ధులకు బిపి షుగర్ టెస్టులు చేసి థైరాయిడ్ అన్ని రకాల టెస్టుల కోసం బ్లడ్ శాంపిల్ తీసుకోవడం జరిగినది. అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరిగినది . ఈ క్యాంపులో సుమారు 35 మంది వయోవృద్ధులు హెల్త్ చెకప్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సహాయకులు నాగేంద్ర, ప్రాణమ్ డేకేర్ సెంటర్ సూపరిండెంట్ చుంచు రమేష్, రాయినిగూడెం పి హెచ్ సి ల్యాబ్ టెక్నీషియల్స్ నర్సులు డే కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రుపట్ల గ్రామపంచాయతీ లో పేరుకే పల్లె ప్రకృతి వనం

# అందులో చెట్లు లేవు ఎండిపోయిన పిచ్చి చెట్లతో నిండిపోయింది


పల్లె ప్రకృతి వనం చెట్లతో నిండి చల్లని వాతావరణం కనిపించాలి కానీ ఆ పల్లె ప్రకృతి వానం ఎండిపోయిన పిచ్చి చెట్లతో ఇప్పటివరకు దానిని పట్టించుకోకుండా ఉన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99 రోజుల ప్రజాప్రక్షాళన కార్యక్రమంలో కనీస వసతులు పల్లె ప్రకృతి వనంలో కనిపించలేదు పల్లె ప్రకృతి వనంలో చెట్లకు నీళ్లు లేక కొన్ని జామ చెట్లు ఎండిపోయినవి దీనిపై సర్పంచ్ సంధ్యారాణి సెక్రెటరీ శృతి చర్య తీసుకుని పల్లె ప్రకృతి వనం కలకడలాడేటట్టుగా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు మరియు వైకుంఠధామం లో కూడా



చుట్టూ బౌండరింగ్ ఎక్కడ నుండి ఎక్కడ వరకు ఉన్నది అక్కడ వరకు ఫెన్సింగ్ వేసి దానిలో కూడా చుట్టు మొక్కలు వేయాలని వైకుంఠధామాన్ని విచ్చలవిడిగా శుభ్రత లేకుండా ఉన్నదని ప్రజలు దీనిపై తగు జాగ్రత్తలు తీసుకొని పల్లె ప్రకృతి వనం దగ్గర బోరింగ్ వేయించాలని నీటి వసతి లేక చాలా వరకు చెట్లు చనిపోవడం జరిగిందని గ్రామ ప్రజలు చెప్పడం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ సర్పంచ్ సెక్రెటర్ తగు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు



# విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి





**పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**గిరివాణి, ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్,ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్**

**మన దునియా,ములుగు జిల్లా ఏటునాగారం:ఏప్రిల్ 20**

విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలు, వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గిరివాణి, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను స్వయంగా కలెక్టర్‌కు అందించారు.జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమానికి 96, ప్రజావాణి కార్యక్రమానికి 26, మొత్తం 122 ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పాఠశాలలు, వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం వాటిని పర్యవేక్షించి, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమ్, క్యాంపస్ పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను వెంటనే అందించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, ఏపీవో వసంతరావు, ఆర్డీఓ వెంకటేష్, డీడీ జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ఐటీడీఏ ఏఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంగళవారం మంగపేట మండలంలో ప్రజా దర్బార్ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**మన దునియా,మంగపేట:ఏప్రిల్ 20**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు, మంగపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ, డిఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్





**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 20**

నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వెంకటాపూర్, ముండ్రాయి, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, ఖానాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఏఎంసి డైరెక్టర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. తమ రైతులు కష్టార్జిత పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి, క్వింటాల్‌కు రూ.2,389 మద్దతు ధర పొందాలని కోరారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.రైతులు ధాన్యం విక్రయించిన అనంతరం 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారనీ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ధాన్యం విక్రయానికి తీసుకొచ్చే రైతులు తేమ శాతం 14లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాలు, తేమ శాతం వంటి సాంకేతిక సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే కొనుగోలు ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని వివరించారు. ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని సాదుల పవన్ కుమార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి రైతు వరకు చేరేలా తనవంతు కృషి చేస్తానన్నారు. రైతులు సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పనిచేస్తానని, రైతుల అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ఏఓ గీత, మాజీ జడ్పీటీసీ దువ్వల మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్లు ఇమ్రాన్, కొమ్మరాజుల ఐలయ్య, పిడిశెట్టి ప్రభాకర్,గొట్టం రంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మైపాల్ రెడ్డి,గణపురం రమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# వంగపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, పెద్దఎత్తున స్పందన**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామానికి చెందిన వేల్పుల అరవింద్ (బంటు), తన తండ్రి స్వర్గీయ వేల్పుల రమేష్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ మెడికవర్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహించడం విశేషం.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కూడా మెడికవర్ హాస్పిటల్స్ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతున్నదని ప్రశంసించిన విషయం గుర్తుచేశారు.

**వివిధ వైద్య విభాగాల సేవలు**

ఏప్రిల్ 20, 2026 సోమవారం ఉదయం 9 గంటల నుండి గ్రామంలోని రైతు వేదిక వద్ద ప్రారంభమైన ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఆఫ్తాల్మాలజీ తదితర విభాగాల వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపూర్ సీఐ నవీన్ హాజరై మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు దగ్గర్లోనే వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి అవసరమైన సదుపాయాలు కల్పించిన గ్రామ సర్పంచ్ నాకిర్త రాజు మరియు పాలక




వర్గానికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆరోగ్యం కోసం సేవ ,వంగపల్లి గ్రామంలో ఆదర్శ కార్యక్రమం

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



## "మెపా" సహకారంతో... రాష్ట్ర స్థాయి ముదిరాజ్ పెద్దలను కలిసిన పాపయ్యపేట ముదిరాజ్ లు



**మన దునియా,వరంగల్ జిల్లా చెన్నారావుపేట,పాపయ్యపేట: ఏప్రిల్ 20**

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి ముదిరాజ్ కుల పెద్దలు మెపా ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ సహకారంతో ..రాష్ట్ర స్థాయి ముదిరాజ్ పెద్దలు ఈటల రాజేందర్ ముదిరాజ్,బండా ప్రకాష్ ముదిరాజ్,నీలం మధు ముదిరాజ్,కాసాని వీరేష్ ముదిరాజ్ లను హైదరాబాద్ లోని వారి వారి నివాసాల్లో కలిసారు.ఈ సందర్భంగా పాపయ్యపేట ముదిరాజ్ కుల పెద్దలు ఉప్పరి చిన్న స్వామి,సొసైటీ అధ్యక్షుడు హంస చంద్రయ్య ముదిరాజ్ లు మాట్లాడుతూ.... పాపయ్యపేట లోని పలు ముదిరాజ్ సమస్యలను ముదిరాజ్ పెద్దల దృష్టికి తీసుకురాగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. పాపయ్యపేట ముదిరాజ్ కులస్తులను.. ఈటల రాజేందర్,నీలం మధు ,కాసాని వీరేష్ ముదిరాజ్ లకు పరిచయం చేసిన మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ చైర్మన్ ఉప్పరి వీరస్వామి,అన్నెబోయిన అనిల్ ముదిరాజ్ లు మాట్లాడుతూ..ఈటెల రాజేందర్ ,నీలం మధు, కాసాని వీరేష్ ముదిరాజ్ లు మా గ్రామానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని, వీరందరినీ కలవడం సంతోషంగా ఉందని, సమయం వెచ్చించి మాట్లాడిన ముదిరాజ్ పెద్దలకు పాపయ్యపేట ముదిరాజ్ కులస్తులందరి తరుపున, మెపా పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో.. పాపయ్య పేట ముదిరాజ్ కుల పెద్దలు ఉప్పరి చిన్న స్వామి, మాజీ సొసైటీ ఉప్పరి కొమురయ్య, పెద్దమ్మ తల్లి ఆలయ చైర్మన్ ఉప్పరి వీరస్వామి,కుల సభ్యులు అన్నెబోయిన అనిల్,ఉప్పరి నర్సింహస్వామి ముదిరాజ్ లతో పాటు మెపా సభ్యులు పాల్గొన్నారు.

# పేటలో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**నలుగురి అరెస్ట్**



**మన దునియా,చిలకలూరిపేట: ఏప్రిల్ 20**

చిలకలూరిపేట: పట్టణంలోని ఎన్.ఆర్.టి సెంటర్ సమీపంలో గల సరళ నర్సింగ్ హోమ్ వీధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార కేంద్రంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ముందస్తు సమాచారంతో, సోమవారం సాయంత్రం అర్బన్ సి.ఐ పి. రమేష్ తన సిబ్బందితో కలిసి ఒక ఇంటిపై దాడి నిర్వహించారు.ఈ దాడిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళతో పాటు, విటుడు మరియు మరో ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 3,650 నగదు మరియు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎట్టకేలకు ముంబై మళ్లీ గెలిచింది... గుజరాత్ పై గ్రాండ్ విక్టరీ

వరుసగా 4 ఓటముల తర్వాత గెలిచిన ముంబై ఇండియన్స్

విధ్వంసక సెంచరీతో చెలరేగిన తిలక్ వర్మ

ఎట్టకేలకు ఈ సీజన్ లో తొలి వికెట్ తీసిన బుమ్రా

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు భారీ విజయంతో ఊపిరి పీల్చుకుంది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత బరిలోకి దిగిన హార్దిక్ సేన, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సోమవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 99 పరుగుల భారీ తేడాతో గ్రాండ్ విక్టరీ నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో యువ సంచలనం తిలక్ వర్మ (101*) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, 4 వికెట్ల హీరో అశ్వని కుమార్, ఇతర బౌలర్లు సమష్టిగా రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. కాగా, నేటి మ్యాచ్ లో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. సాయి సుదర్శన్ ను డకౌట్ చేశాడు. ఈ సీజన్ లో బుమ్రాకు ఇదే తొలి వికెట్. ఈ మ్యాచ్ కు ముందు ఐదు మ్యాచ్ లు ఆడినా, బుమ్రా ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 200 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ కనీస పోరాటం కూడా చేయకుండానే చేతులెత్తేసింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ (0) ఔటవ్వడంతో ఆ జట్టు పతనం మొదలైంది. జోస్ బట్లర్ (5), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (14) కూడా విఫలమయ్యారు. వాషింగ్టన్ సుందర్ (26) కాసేపు పోరాడినా, మిగతా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ముంబై బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ముఖ్యంగా యువ బౌలర్ అశ్వని కుమార్ 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 4 వికెట్లతో గుజరాత్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా మిచెల్ సాంట్నర్, గజన్ఫర్ చెరో రెండు వికెట్లు తీయగా, బుమ్రా, హార్దిక్ పాండ్యా తలా ఒక వికెట్ పడగొట్టారు. దీంతో గుజరాత్ టైటాన్స్ 15.5 ఓవర్లలో కేవలం 100 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో ముంబై శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ గెలుపు రాబోయే మ్యాచ్‌లకు వారికి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లు క్వింటన్ డి కాక్ (13), డానిష్ మలేవార్ (2) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ యాదవ్ (15) కూడా నిరాశపరచడంతో 44 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ముంబై కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, నమన్ ధీర్ (45)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 52 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ధీర్ ఔటయ్యాక, తిలక్ వర్మ తన అసలు విశ్వరూపం ప్రదర్శించాడు. గుజరాత్ బౌలర్లపై సునామీలా విరుచుకుపడ్డాడు. కేవలం 45 బంతుల్లో 8 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15) నెమ్మదిగా ఆడినా, తిలక్ విధ్వంసంతో ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో రబాడా 3 వికెట్లు పడగొట్టాడు.




# డ్రెస్సింగ్ రూమ్‌లో ఇన్ని కన్నీళ్లు ఎప్పుడూ చూడలేదు: వరుణ్ చక్రవర్తి

ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకున్న కేకేఆర్

రాజస్థాన్ జట్టుపై విజయం సాధించిన కేకేఆర్

డ్రెస్సింగ్ రూమ్ లో అందరూ కన్నీళ్లు పెట్టుకున్నారన్న వరుణ్ చక్రవర్తి

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. నిన్న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రింకూ సింగ్, అనుకూల్ రాయ్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందించారు. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌లలో ఐదు ఓటములు, ఒక మ్యాచ్ రద్దు కావడంతో డీలా పడ్డ కేకేఆర్ క్యాంప్‌లో ఈ విజయం కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ గెలుపు ఎంతటి ప్రాముఖ్యమైనదో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మాటల్లో వ్యక్తమైంది. "ఈ రోజు మా డ్రెస్సింగ్ రూమ్‌లో నేను చూసినన్ని కన్నీళ్లు.. 2024లో మేము టైటిల్ గెలిచినప్పుడు కూడా చూడలేదు" అని అతడు వ్యాఖ్యానించడం జట్టుపై ఉన్న ఒత్తిడికి అద్దం పడుతోంది. ఈ మ్యాచ్‌లో కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తి తన మునుపటి ఫామ్‌ను చాటుకోవడమే కాకుండా, కేకేఆర్ తరపున 100 వికెట్లు తీసిన మూడవ బౌలర్‌గా (సునీల్ నరైన్, రస్సెల్ తర్వాత) అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. అయితే, ఈ సీజన్ ఆరంభం నుంచి తాను తీవ్రమైన గాయాలతో ఇబ్బంది పడుతున్నట్లు వరుణ్ వెల్లడించాడు. సీజన్ ప్రారంభానికి ముందే ఎడమ చేతి రెండు వేళ్లు ఫ్రాక్చర్ అయ్యాయని, దానివల్ల ఫీల్డింగ్ చేయడం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బయట నుంచి వచ్చే తీవ్ర విమర్శల ప్రభావం తమపై పడకుండా కోచింగ్ స్టాఫ్ తమకు అండగా నిలిచారని వరుణ్ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ ఒక్క విజయం తమలో నమ్మకాన్ని పెంచిందని, మెల్లగా జట్టు మళ్లీ గాడిలో పడుతుందని ధీమా వ్యక్తం చేశాడు.



## తిలక్ వర్మ సూపర్ సెంచరీ.. ముంబై భారీ స్కోరు

గుజరాత్ టైటాన్స్‌పై అద్భుత సెంచరీ చేసిన తిలక్ వర్మ

ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు

ఒక దశలో 44/3తో కష్టాల్లో ఉన్న ముంబైని ఆదుకున్న తిలక్

గుజరాత్ బౌలర్లలో రబాడకు మూడు వికెట్లు



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ యువ సంచలనం తిలక్ వర్మ అసాధారణ పోరాటంతో అదరగొట్టాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో కదం తొక్కాడు. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా, ఒకవైపు సహచరులు వరుసగా విఫలమవుతున్నా, ఒంటరి పోరాటం చేసి ముంబైకి భారీ స్కోరు అందించాడు. కేవలం 45 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్ల సహాయంతో 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తిలక్ వర్మ శతక విజృంభణతో ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఐపీఎల్ లో తిలక్ వర్మకు ఇదే తొలి సెంచరీ. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ డానిష్ మలేవార్ (2), క్వింటన్ డికాక్ (13), సూర్యకుమార్ యాదవ్ (15) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరారు. పవర్‌ప్లే ముగిసేసరికి ముంబై 44 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. గుజరాత్ బౌలర్ కగిసో రబాడ తన పదునైన బౌలింగ్‌తో ముంబై టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, మరో యువ బ్యాటర్ నమన్ ధీర్ (32 బంతుల్లో 45)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 52 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. నమన్ ధీర్ ఔటయ్యాక, తిలక్ వర్మ తన విశ్వరూపం ప్రదర్శించాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 15) నెమ్మదిగా ఆడగా, తిలక్ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. ముఖ్యంగా ప్రసిద్ధ్ కృష్ణ, అశోక్ శర్మ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆఖరి ఓవర్లలో తిలక్ ఆడిన తీరుతో ముంబై స్కోరు అమాంతం పెరిగింది. అతని అద్భుత ఇన్నింగ్స్ వల్లే ముంబై 200 పరుగుల మార్కుకు చేరువైంది. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 4 ఓవర్లలో 33 పరుగులిచ్చి 3 వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ పడగొట్టారు. అయితే, తిలక్ వర్మ విధ్వంసం ముందు గుజరాత్ బౌలింగ్ తేలిపోయింది. అతని వీరోచిత సెంచరీతో ముంబై, గుజరాత్ ముందు 200 పరుగుల కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

## టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్.. ఇద్దరు కొత్త ఆటగాళ్లతో బరిలోకి ముంబై

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న 30వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్, ఈ మ్యాచ్ కోసం జట్టులో పలు కీలక మార్పులు చేసింది. యువ ఆటగాళ్లు కృష్ భగత్, డానిష్ మలేవర్‌లు ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేస్తున్నారు. వీరి కోసం ర్యాన్ రికిల్టన్, దీపక్ చాహర్‌లను పక్కనపెట్టింది. టాస్ గెలిచిన అనంతరం గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, "గత మ్యాచ్‌లో మంచు ప్రభావం కనిపించింది, అందుకే ఛేజింగ్ సులభం అవుతుందని భావించి బౌలింగ్ ఎంచుకున్నాం. మా బౌలర్లు అద్భుతంగా రాణిస్తున్నారు, ముఖ్యంగా రషీద్ ఖాన్ మిడిల్ ఓవర్లలో కీలకంగా మారుతున్నాడు. అదే జోరును కొనసాగించాలని ఆశిస్తున్నాం" అని తెలిపాడు. తాము గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతున్నామని స్పష్టం చేశాడు. ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ, "మేము కూడా ఫీల్డింగ్ తీసుకోవాలనే అనుకున్నాం. వరుస ఓటముల తర్వాత జట్టుగా పుంజుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని అంశాలపై చర్చించాం. ఈ మ్యాచ్‌తో గెలుపుల బాట పట్టాలని చూస్తున్నాం. సపోర్ట్ బౌలర్‌గా మమ్మల్ని ఆకట్టుకున్న కృష్ భగత్ ఈరోజు అరంగేట్రం చేస్తుండటం సంతోషంగా ఉంది" అని అన్నాడు. ప్రస్తుత సీజన్‌లో గుజరాత్ వరుసగా మూడు విజయాలతో మంచి ఫామ్‌లో ఉండగా, ముంబై ఇండియన్స్ వరుసగా నాలుగు మ్యాచ్‌లలో ఓడిపోయి పాయింట్ల పట్టికలో వెనుకబడింది. గుజరాత్ టైటాన్స్ శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, అశోక్ శర్మ, కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ. ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: జాసన్ హోల్డర్, షారుఖ్ ఖాన్, మానవ్ సుతార్, కుల్వంత్ ఖేజ్రోలియా, అనూజ్ రావత్. ముంబై ఇండియన్స్క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), డానిష్ మలేవర్, నమన్ ధీర్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్, మిచెల్ శాంట్నర్, కృష్ భగత్, జస్ప్రీత్ బుమ్రా, అల్లా ఘజన్ఫర్. ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: మయాంక్ రావత్, కార్బిన్ బాష్, రాజ్ బావా, అశ్వని కుమార్, రఘు శర్మ.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



## అనసూయపై అసభ్యకర పోస్టులు.. నల్గొండకు చెందిన నిందితుడి అరెస్ట్!

**ఇన్స్టా వేదికగా సినీ నటి అనసూయపై అసభ్యకర పోస్టులు**

**టెక్నాలజీ సాయంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు**

**అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన వైనం**

ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వేగంగా స్పందించి ఒక నిందితుడిని కటకటాల వెనక్కి నెట్టారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తనపై అత్యంత అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ, తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెడుతున్నారంటూ అనసూయ పోలీసులను ఆశ్రయించారు. సాంకేతిక ఆధారాల సాయంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు నల్గొండ జిల్లాకు చెందిన చంటి అని గుర్తించి అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు నెటిజన్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాను ఇతరులను దూషించడానికి లేదా వేధించడానికి వాడితే ఐటీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేధింపులను భరించకుండా అనసూయ ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడం పట్ల సినీ వర్గాలు, నెటిజన్ల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## 'రాజా శివాజీ'.. భర్త ఎమోషనల్ స్పీచ్, కంటతడిపెట్టిన జెనీలియా

**'రాజా శివాజీ' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో దంపతుల భావోద్వేగం**

**భార్య సహకారం, తండ్రిని గుర్తు చేసుకుంటూ రితేశ్ భావోద్వేగం**

**మే 1వ తేదీన విడుదల కానున్న సినిమా**

'రాజా శివాజీ' చిత్రానికి తాను పడిన కష్టాన్ని, భార్య జెనీలియా అందించిన సహకారాన్ని, తన తండ్రిని తలుచుకుంటూ సినీ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ ఎమోషనల్ అయ్యారు. ఆయన పక్కనే ఉన్న జెనీలియా ఆ మాటలకు భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారు. 'రాజా శివాజీ' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో వీరిద్దరు భావోద్వేగానికి గురయ్యారు. ఇద్దరూ భావోద్వేగానికి గురికావడంతో అక్కడ కాసేపు గంభీరమైన వాతావరణం కనిపించింది. ఛత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా 'రాజా శివాజీ'. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో రితేష్ దేశ్‌ముఖ్ టైటిల్ పాత్ర పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో జెనీలియా కూడా నటించారు. సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, విద్యాబాలన్ తదితర ప్రముఖులు కీలక పాత్రల్లో నటించారు. మే 1న విడుదల ఈ సినిమా విడుదల కానుంది.





## విజయ్ దేవరకొండ-శౌర్యువ్ చిత్రం ప్రారంభం.. ముహూర్తం షాట్ కు నాని క్లాప్

**శౌర్యువ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కొత్త చిత్రం ప్రారంభం**

**పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో నాని**

**తొలి క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాని**

**ఈ సినిమా కోసం నా సర్వస్వం ఇస్తానన్న విజయ్ దేవరకొండ**

**వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం**

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. 'హాయ్ నాన్న' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న శౌర్యువ్‌తో ఆయన ఈ చిత్రాన్ని చేస్తున్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి న్యాచురల్ స్టార్ నాని ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, నాని కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇద్దరు ప్రముఖ హీరోలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'హాయ్ నాన్న'కు అద్భుతమైన సంగీతం అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ చిత్రానికి కూడా స్వరాలు సమకూర్చనున్నారు. ప్రస్తుతం సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయ్ దేవరకొండ తన ప్రస్తుత కమిట్‌మెంట్లు పూర్తి చేసిన వెంటనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. నటీనటులు, ఇతర సాంకేతిక సిబ్బంది వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇంతకుముందే, దీనిపై విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. "ఈ భయపెట్టే సినిమాను రూపొందించేందుకు ఒక అద్భుతమైన గ్లోబల్ టీమ్‌ను పరిచయం చేస్తున్నా. శౌర్యువ్ అద్భుతమైన ఆలోచనలకు, ఆయనలోని తీవ్రతకు వీరు తోడవుతున్నారు. ఈ సినిమా కోసం నా సర్వస్వం ఇస్తాను" అని పేర్కొన్నారు

## వాట్ ఏ జర్నీ... పూరీ జగన్నాథ్ కెరీర్ పై విజయ్ సేతుపతి ట్వీట్

**భారత చలనచిత్ర పరిశ్రమలో 26 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న పూరీ జగన్నాథ్**

**పూరీ ప్రయాణం ధైర్యం, నమ్మకంతో నిర్మించిన ఒక లెగసీ అని ప్రశంస**

**పూరీ దర్శకత్వంలో 'స్లమ్‌డాగ్' చిత్రంలో నటిస్తున్న విజయ్ సేతుపతి**

**పూరీతో పనిచేయడం గొప్ప అనుభవమని వ్యాఖ్య**

టాలీవుడ్ డైనమిక్, డ్యాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ భారత చలనచిత్ర పరిశ్రమలో 26 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన దర్శకత్వంలో 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్' చిత్రంలో నటిస్తున్న ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పూరీ జగన్నాథ్‌పై ప్రశంసలు కురిపిస్తూ విజయ్ సేతుపతి ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. "ఈ 26 ఏళ్ల ప్రయాణం ఒక మైలురాయి మాత్రమే కాదు.. ధైర్యం, నమ్మకం, నిర్భయ స్వరంతో నిర్మించిన ఒక గొప్ప లెగసీ. ఆయన స్ఫూర్తినిస్తూ, ఉత్తేజపరుస్తూ ఇండస్ట్రీని శాసిస్తున్నారు. పూరీ గారూ, మీతో కలిసి 'స్లమ్‌డాగ్' చిత్రానికి పనిచేయడం గొప్ప అనుభవం. నటులుగా మమ్మల్ని నమ్మి, మా కంఫర్ట్ జోన్‌ల నుంచి బయటకు నెట్టే దర్శకులు కావాలి. మీరు ఆ పనిని చాలా సులువుగా చేస్తారు. ఈ సినిమా మనందరికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని నమ్ముతున్నాను," అని పేర్కొన్నారు. పూరీ మరిన్ని విజయాలు సాధించి, ప్రభావవంతమైన కథలతో ప్రేక్షకులను అలరించాలని విజయ్ సేతుపతి ఆకాంక్షించారు. పూరీ కనెక్ట్స్ పతాకంపై ఛార్మి కౌర్‌తో కలిసి పూరీ జగన్నాథ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, టబు, సంయుక్త, బ్రహ్మాజీ వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. 'స్లమ్‌డాగ్' చిత్ర బృందం కూడా పూరీకి శుభాకాంక్షలు తెలియజేసింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com